


రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ రాయవలస నుండి చిట్టంపాడు వాటర్ ఫాల్స్ మీదుగా నందనపురం కొత్తవలస గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం నిమిత్తం రూ 4. కోట్ల 40 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని టోకూరు పంచాయతీ సర్పంచ్, సీపీఎం నేత కిల్లో. మోస్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అరుకు పర్యటనకు వచ్చినప్పుడు రాయవలస నుండి చిట్టంపాడు వాటర్ ఫాల్స్ మీదుగా నందనపురం కొత్తవలస వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అందుకు స్పందించిన డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు బీటీ రోడ్డు నిర్మాణం కి ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కి పంపించడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు గెమ్మెల. దేవన్న పాల్గొన్నారు.



లేఖను చూపుతున్న సర్పంచ్

మూత 'బడి'

- తెరుచుకోని పాఠశాలలు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్న నేటికీ ఉపాధ్యాయులు నియమించలేదు. దీంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్న పరిస్థితి నెలకొంది.

అరకులోయ మండలం లోతేరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సుమారు ఏడు పాఠశాలలో ఇప్పటికీ ఉపాధ్యాయులు లేరు. ఉపాధ్యాయులు నియమించక పోవడంతో నేటి వరకు పాఠశాలకు తలుపులు తెరవలేదు.దీంతో విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వంతలగూడ, తోడుబంధ, అడారి, ధనసానివలస, బొరకలవలస, లండిగూడ, కాగువలస పాఠశాలలో ఉపాధ్యాయుల లేక పాఠశాలలు తెరచుకోలేదు.ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఆరో తరగతికి హైస్కూల్‌కి వెళ్లాలంటే సర్టిఫికెట్ ఇవ్వడానికి ఉపాధ్యాయులు లేని పరిస్థితి నెలకొంది. దీంతో సర్టిఫికెట్ ఎవరిని అడగాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడిబాట పట్టవలసిన విద్యార్థులు వీధుల్లో తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



మూసి వేసివున్న తోడుబంధ పాఠశాల



వంతలగుడ పాఠశాలలో టీచర్ లేక ఆవేదన వ్యక్తం చేస్తున్న పిల్లలు

ఉపాధ్యాయులను నియమించాలి

విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి 2 వారాలు కావస్తున్నా నేటికీ ఉపాధ్యాయులను నియమించక పోవడం దారుణం. ఇలాగైతే గిరిజన విద్యా వ్యవస్థ కుంటిపడే అవకాశం ఉందని తక్షణం ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలి.



కొర్ర మోహన్ రావు.
వంతలగూడ గ్రామం
పెసా కమిటీ ఉపాధ్యక్షుడు



సూచనలు ఇస్తున్న కలెక్టర్

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లో జులై 1న మంగళవారం జరుగనున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి హాజరవుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాటు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేస్తున్న నేపథ్యంలో సంబంధిత పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఇతర అధికారులతో తో కలసి గురువారం ఉదయం పాడేరు మండలం లగిశపల్లిలో హెలిపేడ్ స్థలాన్ని, బహిరంగ సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి సభాస్థలికి చేరుకునే దగ్గర నుంచి తిరుగుపయనమయ్యే వరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఎ.ఎస్.పి ధీరజ్, డి.ఎస్.పి షేక్ అహమ్మద్ షెహాబాజ్, జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి పి.మురళీ, తహసీల్దార్ వి. త్రినాథరావు నాయుడు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీల ఉద్యోగోన్నతుల్లో అన్యాయం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి సీతారామరాజు జిల్లాలో గ్రామ సచివాలయ హెల్త్ సెక్రెటరీ పదోన్నతులు కల్పించడం తీవ్ర అన్యాయం జరిగిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. .కేవలం 30 మందికే ప్రమోషన్ వచ్చాయని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. జీవో 68 ప్రకారం గిరిజన ప్రాంతంలో ఎక్కువ మందికి ప్రమోషన్లు రావాల్సి ఉందన్నారు. జీవో నెంబర్ 68 ప్రకారం ప్రమోషన్ చేయకుండా ఓపెన్ లో చేయడంతో గిరిజనులకి తీవ్రమైన అన్యాయం జరిగిందని తెలిపారు. తక్షణం ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలో ఉన్న హెల్త్ సెక్రటరీలకు జీవో నెంబర్ 68 ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం
- లాగరాయి పిహెచ్‌సి వైద్యాధికారి నాగార్జున సస్పెన్షన్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్పష్టం చేశారు. మండలంలోని లాగరాయి పిహెచ్‌సిని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పీహెచ్సీలో వసతులు, మందులు, రోగులుకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున విధులకు గైర్హాజరు కావడంతో పిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన్ను తక్షణం సస్పెండ్ చేయమని డిఎం అండ్ హెచ్‌ఒ, అడిషనల్ డీఎంహెచ్వోలకు పిఒ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, లాగరాయి సర్పంచ్ మిరియాల ధనలక్ష్మి, ఆదివాసి జేఏసీ నాయకులు వంతు బాలకృష్ణ తదితరులు పీహెచ్‌సీలో నెలకొన్న పలు సమస్యలు పిఒ దృష్టికి తీసుకెళ్లారు. వైద్యాధికారి తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారని, రోగులపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఆయన వ్యవహార శైలి బాగోలేదని తెలిపారు. లాగరాయి పరిధిలో ఉన్న లోతట్టు గ్రామాల నుండి అధిక సంఖ్యలో రోగులకు ఈ పిహెచ్సీయే ఆధారం కనుక మరో వైద్యాధికారిని వెంటనే నియమించాలని కోరారు. అనంతరం పిఒ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైద్యాధికారులు రోగుల పట్ల ప్రేమగా మెలగాలని, సమయపాలన పాటించాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రైవేట్ క్లినిక్‌ల ద్వారా సంపాదన ఉంటే రోగులకు సేవలు సక్రమంగా అందించలేరని, అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో పీహెచ్సీ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు పర్యవేక్షించి పారిశుధ్య చర్యలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతం అభివృద్ధిలో... విద్యుత్, రోడ్లు, టెలికం సర్వీసులు కీలకం

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన ప్రాంతంలో అభివృద్ధికి విద్యుత్, రహదారులు, టెలికం సర్వీసులు కీలకమని డిపార్ట్మెంట్ అఫ్ టెలికమ్యూనికేషన్స్, మినిస్టరీ అఫ్ కమ్యూనికేషన్స్ అదనపు కార్యదర్శి గుల్జార్ నటరాజన్ అన్నారు.గురువారం జిల్లా కలెక్టరెట్ సమావేశ మందిరంలో అదనపు సెక్రెటరీ డిపార్ట్మెంట్ అఫ్ టెలికమ్యూనికేషన్స్, మినిస్టరీ అఫ్ కమ్యూనికేషన్స్ గుల్జార్ నటరాజన్, జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ తో కలసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్జిఓ ఫామ్ ఏర్పాటు చాలా సంతృప్తి కలిగించిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యుత్, రహదారులు, టెలికం సర్వీసులు కీలకమని జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు కమ్యూనికేషన్ చాలా అవసరం అన్నారు. అనంతరం జిల్లాలో సెల్ టవర్స్ పనితీరును పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యా, వైద్యం, టూరిజం, జన్మన్, పి.ఎం అవజ్ యోజనా, ఇళ్ల నిర్మాణాల ప్రగతి, వ్యవసాయం వంటి వాటిపై వివరించారు.ఆర్గానిక్ పంటలు పండిస్తున్నారన్నారు. ట్రైబల్ ప్రాంతాల్లో ఉన్న మోడల్ స్కూల్ అమలు తదితర అంశాలను వివరించారు. జిల్లాలో 1591 టవర్స్ మంజూరు జరిగిందని, అందులో జిల్లా యంత్రాంగం 1584 మంజూరు చేయడం జరిగిందన్నారు. అరకు కాఫీ ఉత్పత్తులను వివరించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌరమన్ పటేల్, సహాయ కలెక్టర్ చిరంజీవి నాగ వెంకట సాహిత్, బిఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం, జియో డిజియం జి. సత్యప్రసాద్, ఎయిర్టెల్ డిప్యూటీ మేనేజర్ వై.మృణాల్, డిఆర్డిఎ పి.డి పి.మురళీ, ఎపిఎపీడిసిఎల్ ఎస్ఇ జి ఎన్ ప్రసాద్, ఐసిడిఎస్ పిడి జాన్సీరామ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రజనీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కార్యదర్శి నటరాజన్

అడ్డతీగల మండల కేంద్రంలో అక్రమ కట్టడాలను తొలగించాలి : లోతా

ప్రజాశక్తి-రంపచోడవరం

అడ్డతీగల మండల కేంద్రంలో ఆక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అడ్డతీగలలో అక్రమ కట్టడాల తొలగింపులో అడ్డుపడుతుంది ఎవరని? రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు ఒక న్యాయం, అడ్డతీగలకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. అనంతబాబు బిల్డింగ్ కోసమే అడ్డతీగలలో ఉన్న అక్రమ కట్టడాలు కూల్చకుండా మంత్రి దగ్గర తెలుగుదేశం నాయకులు రాయబారం నడుపుతున్నారని విమర్శించారు. నోటీసులు ఇచ్చి ఇన్ని రోజులు ఎందుకు ఆగుతున్నారో సమాధానం చెప్పాలని లోతా రామారావు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని న్యాయస్థానం, కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అడ్డతీగల, రాజవొమ్మంగి అధికారులు ఉత్తర్వులు అమలు చేయకుండా ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారో చెప్పాలని, అధికారులను అడ్డుపడుతు తమ విధులకు ఆటంకపరుస్తున్న వారు ఎవరో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అడతీగల మండల కేంద్రంలో ఇప్పటికే ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకొని బహుళ అంతస్తులు కట్టుకొని గిరిజన చట్టాలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగిస్తున్నారని తెలిపారు. గిరిజన చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు రాజకీయ నాయకులకు, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

జన్‌మన్ గృహాల బిల్లులు విడుదల

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలో పీఎం జన్మన్ గృహ పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం విడుదల చేసిందని హౌసింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ చిన్నబాబు ఒక పత్రికా ప్రకటనలో బుధవారం తెలిపారు.మండలంలోని బిఎల్ విభాగంలో ఉన్న 202 మంది లబ్ధిదారులకు రూ.1.44 కోట్లు, ఎల్ఎల్ విభాగంలో ఉన్న 49 మందికి రూ.44.10 లక్షలు, అలాగే ఆర్‌సి విభాగానికి చెందిన 27 మందికి రూ.1.08 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ చేయనున్నట్లు రెండు మూడు రోజుల్లోగా ఈ బిల్లులన్నీ చెల్లింపయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.



ప్రకృతి అందాలను తిలకిస్తున్న న్యాయమూర్తి దంపతులు

అరకు అందాలు తిలకించిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: -ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన అరకు అందాలు ప్రకృతి ఒడికి కమనీయంగా ఉన్నాయని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నలిన్ కుమార్ శ్రీ వాత్సవ అన్నారు. అరకు అందాలను తిలకించేందుకు కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన అంజోడా సిల్క్ ఫాం పైనరీ, పర్యాటక కేంద్ర చాపరాయి జలపాతంలో ఆయన సందర్శించారు. దీనికి ముందుగా అరకు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి రాము సాదరంగా స్వాగతం పలికారు. ఆయా పర్యాటక కేంద్రాల్లో చుట్టూ కొండలు, పచ్చని అందాలున్న జలవిహారిని తిలకించారు. ఏఎస్ఐ పురంధర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేషన్ అందిస్తున్న తహశీల్దార్, సిబ్బంది

ఇంటి వద్ద రేషన్ పంపిణీ

ప్రజాశక్తి -జి.మాడుగుల: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 65 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు మండలంలోని సాడెకు గ్రామంలో ఇంటి వద్దకే రేషన్‌ను స్థానిక తహశీల్దార్ రాజ్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమం నెల 26 తేదీ నుంచి 30 తేది వరకు జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తెరుచుకున్న ఎంపిపి పాఠశాల

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -సీలేరు

జీకె వీధి మండలం సీలేరు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఎట్టకేలకు తెరుచుకుంది. ఈ పాఠశాల హెచ్‌ఎం క్రాంతి కుమారి గురువారం విధులక హాజరయ్యారు. విద్యార్థులకు విద్య బోధన చేశారు. బదిలీ అయిన ప్రధానోపాధ్యాయురాలు క్రాంతి కుమారి కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు ఇక్కడ విధులు నిర్వర్తించాల్సి ఉండగా, ఆమె గైర్హాజరు కావడంతో కొన్ని రోజులుగా పాఠశాల తెరుచుకోలేదు. దీనిపై ప్రజాశక్తి 'విధులకు డుమ్మా.. ఇలాగైతే ఎలాగమ్మ..? శీర్షికన మంగళవారం కథనం, ఉపాధ్యాయులేరీ? శీర్షికన బుధవారం వార్తను ప్రచురించింది. దీనికి స్పందించిన జీకే వీధి ఎంఈఓ-1 సత్యనారాయణ, ఎంఈఓ-2 రామన్న తక్షణమే సీలేరు ఎంపీపీ పాఠశాలకు వెళ్లి విధులు చేపట్టాలని క్రాంతి కుమారిని ఆదేశించారు. ఈ మేరకు ఆమె గురువారం పాఠశాలకు చేరుకొని విద్యా బోధన చేశారు.

ఈ సందర్భంగా హెచ్‌ఎం క్రాంతికుమారి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా తనకు నక్కపిల్లి పాఠశాలకు బదిలీ కావడంతో అక్కడ జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చానని తెలిపారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎంటిఎస్‌గా స్థానిక ఎంపీపీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సూర్య కుమారుని బదిలీల ప్రక్రియలో భాగంగా కౌన్సిలింగ్‌కి పిలవడంతో వెళ్లినట్లు చెప్పారు. తన స్థానంలో వేరొక ప్రధానోపాధ్యాయులను ఎంపీపీ పాఠశాలకు నియమించే వరకు అధికారులు ఆదేశాల మేరకు తానే విధుల్లో కొనసాగుతానని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం యధావిధిగా అమలు చేస్తున్నామని, విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.



పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థులు

పాఠశాల భవనం శిథిలం

- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం, మర్రివాడ పంచాయతీ, లూసం గ్రామంలో ఉన్న జిపిటిడబ్ల్యు పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైంది. ఈ పాఠశాలలో ప్రస్తుతం 16 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనాన్ని నిర్మాణం చేసి 40 ఏళ్లు దాటింది. దీంతో భవనం పైకప్పు రేకులు చితికిపోయి రంధ్రాలు పడ్డాయి. వర్షం పడితే మొత్తం కారిపోతుంది. పిల్లలు కూర్చోడానికి వీలు లేకుండా ఉంది. గోడలు శిథిలావస్థలో ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలోని స్కూల్ గ్రాంట్ రూ.26వేలు నాటి ఉపాధ్యాయుడు ఈరె గంగరాజు పాఠశాల మరమ్మతులకు ఖర్చు చేయలేదని, ఈ డబ్బులు ఏమయ్యాయో కూడా తెలియదని స్థానికులు చెబుతున్నారు. పాఠశాల భవనం శిథిలం కావడంపై పలు మార్లు విద్యా కమిటీ వారు ఎంఇఒ, ఇతర అధికారులకు విన్నవించారని, అయినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

మరో వైపు ఈ గ్రామం మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో మారుమూలన ఉంది. ఇది ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో ఉపాధ్యాయుడు వస్తేనే తరగతులు, లేకుంటే మూత పడి ఉంటుంది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో గ్రామంలోని పశువులన్నీ రాత్రి సమయంలో పాఠశాల వరండాలోనే సేదతీరుతున్నాయి. దీంతో తెల్లవారే సరికి మొత్తం పేడలతో నిండి ఉంటుంది. పాఠశాలను తెరిస్తే వాటిని శుభ్రం చేసుకోవాల్సి వస్తోంది. తక్షణమే పాఠశాలకు కొత్త భవనం నిర్మించి, ప్రహరీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పైకప్పు రేకులు శిథిలమై రంధ్రాలు పడిన దృశ్యం


రెండు రోజుల్లో బిల్లులు జమ

ప్రజాశక్తి-కొయ్యూరు

పీవీటిజీ గ్రామాల్లో పిఎం జన్‌మన్ పథకం ద్వారా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు మరో రెండు రోజుల్లో లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీవీటిజీ గ్రామాల్లో 938 మంది లబ్దిదారులకు హౌసింగ్ శాఖ కింద పక్కా ఇల్లు మంజూరు చేయగా, వారిలో 521 మంది నిర్మాణాలు చేసినట్లు చెప్పారు. వీటికి సంబంధించి నిబంధనల ప్రకారం పక్కా ఇల్లు నిర్మించుకుంటున్న లబ్దిదారులకు మండలంలో రూ.46 లక్షల నిధులు మంజూరైనట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ మండల ఏఐ గోవింద్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకొని ప్రాణాలు కాపాడాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అరకులోయ బ్రాంచ్ సహకారంతో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు 70 మంది వరకు పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని దానాలలో రక్తదానం మహాదానం అని అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.రక్త దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ్ కుమార్, అరకులోయ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాము, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు పాల్గొన్నారు.

మూగజీవాలకు నట్టల నివారణ టీకాలు



అనంతగిరిలో జీవాలకు డీవార్మింగ్ చేస్తున్న పశువైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు ఈనెల 26 నుండి జులై 10 వ వరకు టీకాలు వేయడం జరుగుతుందని కాశీపట్నం పశువైద్య అధికారి సాగిరి.గణేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువారం కాశీపట్నం పంచాయతీ సారావానిపాలెం, చిలకలగెడ్డ పంచాయతీ చిలకలగెడ్డలో 126 గొర్రెలు. 348 మేకలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. శరీరంలో నట్టలు వృద్ధి చెందితే జీవాలు అనారోగ్యానికి గురవుతాయని తెలిపారు.వ్యాధి తీవ్రమైతే మరణాలు సంభవించే అవకాశం అధికంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కాశీపట్నం ఎంపీటీసీ సన్యాసిరావు, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

జీమాడుగుల మండలంలో గెమిలి పంచాయతీ గెమిలి కొత్తూరు గ్రామంలో పశు వైద్యాధికారి సృజనా కుమారి ఆధ్వర్యంలో గురువారం మేకలు, గొర్రెలకు నట్టలు నివారణ మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ గ్రామంలో 113 మేకలకు నట్టల నివారణ మందులు అందజేసినట్టు తెలిపారు. రైతులు ఈ సీజన్లో మేకలకు గొర్రెలకు నట్టల నివారణ మందు తప్పక వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవో భాస్కరరావు, ఏ హెచ్ఎ ఎస్. కొండబాబు, రఘునాథ్, వెంకట్ ,శ్యామ్ ప్రవీణ్ ,మత్స్యలింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

• జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ • మన్యంలో మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం ర్యాలీలు



పాడేరులో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : మాదక ద్రవ్యాల వినియోగం సమాజానికి చేటు చేస్తుందని, వీటికి దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. జిల్లాలో గంజాయి సమూలంగా నిర్మూలించడానికి అందరూ సహకారం అందించాలని పిలుపు నిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సం (నషా ముక్తి భారత్ అభియాన్) సందర్భంగా ఐటిడి ఏ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో మాదక ద్రవ్యాల చెడు ప్రభావరం పై అందరికి అవగాహన ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలో 10 మందితో డీ ఎడిక్షన్ సెంటర్ ప్రారంభించామని, ప్రస్తుతం 150 మంది మత్తు విముక్తిపై వైద్యం అందిస్తున్నామన్నారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల భారిన పడిన బాధితులు ఉంటే డీ ఎడిక్షన్ సెంటర్కు తరలించాలని సూచించారు. జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ సమావేశాలు, ఆశ్రమ పాఠశాలలు, యువ గ్రూపులు, సఖీ గ్రూపులలో గంజాయి సాగు, వినియోగంపై తీర్మానాలు చేయాలని సూచించారు.

ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ, గత ఏడాది 10 వేల ఎకరాల్లో గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా పంటలు సాగు చేయడానికి విత్తనాలు, మొక్కలు రైతులకు పంపిణీ చేసామన్నారు. స్మగ్లర్లు బయట ప్రాంతాల నుండి గిరిజన ప్రాంతానికి వచ్చి గిరిజనులను పక్కదారి పట్టించి మోసం చేస్తున్నారని చెప్పారు గంజాయి స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకుని జైలు పంపిస్తామని హెచ్చరించారు. గంజాయిని సమూలంగా నిర్మూలించడానికి అందరూ సహకారం అందించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని చెప్పారు.

మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ,గంజాయి సాగు నిర్మూలనపై గిరిజన గ్రామాలలో అవగాహన కల్పిస్తామన్నారు. చుట్టా, బీడి, గుట్కాలు, గంజాయి వినియోగించడంతో చాలా మంది కాన్సర్ భారిన పడుతున్నారన్నారు. యువత మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని చెప్పారు. పిల్లల ప్రవర్తన ఎటువైపు వెళుతున్నారో తలిదండ్రులు గమనించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ధీరజ్, చింతపల్లి ఎఎస్పీ నవజ్యోతి మిశ్రా, ఐసిడి ఎస్ పిడి ఝాన్సీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్. గౌరీ శంకరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ టి. హేమలతా దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టి. విశ్వేశ్వర నాయుడు, డి ఎసిపి షేక్ అహ్మద్ షెహబాజ్, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ పి. ఎస్. ఎన్.రాజు, స్థానిక నేతలు బొర్రా నాగరాజు, బొర్రా విజయరాణి, లగిశపల్లి సర్పంచ్ పార్వతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్ బాబు స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో మత్తుపదార్థాల నిరోధక అవగాహన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీడీవో యు.వి.ఎస్. శ్రీనివాసరావు ర్యాలీకి నేతృత్వం వహించారు. గంజాయి సాగు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ వినోద్ బాబు మాట్లాడుతూ, ఒరిస్సా రాష్ట్రం నుంచి అల్లూరి జిల్లాకు గంజాయి అక్రమ రవాణా అవుతుందని పేర్కొన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. యువత మత్తు ప్రలోభాలకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా తమ జీవితాలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వరరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇంద్ర ప్రియాంక, ఎక్సైజ్ సీఐ కుర్మారావు, గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగిన రామరాజు పడాల్, ఐసిడిఎస్ అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ఎం.రామలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖరరావు, రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు: మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎర్రంపేట నుండి చింతూరు ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యాన గురువారం ర్యాలీ నిర్వహించారు. యువత మేలుకో, మత్తుమందు పానీయాలకు దూరంగా ఉండాలి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అంటూ విద్యార్థులు, అధికారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, ఎఎస్పి పంకజ్‌కుమార్ మీనా, సిఐ తెల్లం దుర్గా ప్రసాద్, ఎస్.ఐ.రమేష్, ప్రిన్స్‌పల్ రత్నమాణిక్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ యుక్త వయస్సులో ఉండే యువత, విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉందని తెలిపారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో, సినీ పరిశ్రమల్లో ఉండేదని, కాని ఇప్పుడు చిన్న చిన్న మారుమూల గ్రామాలకు అది విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చింతూరు పోలీస్ శాఖ ఎస్ఐలు పి.రమేష్, జె.కృష్ణ, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ వైవిఎస్ఎల్.స్వామి, హెచ్‌సిలు సిహెచ్.భద్రం, పి.మోహన్‌రావు, ఎండి గోస్, వైస్ ప్రిన్సిపాల్ ఎమ్ శేఖర్, అధ్యాపకులు కె.శకుంతల, జి.వెంకట్రావు, వై.పద్మ, ఎస్.అప్పనమ్మ, జి.హారతి, కె.శైలజ, ఎమ్.నాగ మోహన్‌రావు, ఎన్‌విఎస్ఎన్.మూర్తి, సంగం నాయుడు, శీనయ్య, సుబ్బారావు, కన్నయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్.పురం : గంజాయి వల్ల సమాజానికి ఎంతో చేటని, దాని నిర్మూలన అందరి బాధ్యత అని ఎస్ఐ సంతోష్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా రేఖపల్లి గ్రామంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నుంచి, జంక్షన్ వరకు స్థానిక పోలీసుల ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ, జంక్షన్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్ బాల్యాన్ని బలి తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అటవీ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం : అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇంద్రజిత్ సమక్షంలో ఎక్సైజ్ సీఐ శ్రీధర్, ఎస్సై పైడేశ్వర రావు సిబ్బంది కలిసి అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రంపచోడవరంలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి రంపచోడవరంలో ర్యాలీ చేశారు.



చింతపల్లిలో మాట్లాడుతున్న డాక్టర్ ఇంద్ర ప్రియాంక



చింతూరులో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన ర్యాలీ

గీతం బిఎస్‌సి, ఎంఎస్‌సి స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్‌సి, ఎంఎస్షి కోర్సులలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తెలిపారు.గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంకా ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో నాలుగేళ్ల బిఎస్సీ(ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www.gitam.edu ను సంప్రదించవచ్చునన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు సౌకర్యం కల్పించరూ...

ప్రజాశక్తి.చింతపల్లి:- మారుమూల గిరిజన గ్రామమైన గొర్రెలదుర్రికి రహదారి కల్పించాలన్న ఆశ గత దశాబ్దాలుగా నెరవేరకుండా పోతుండటంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని ఈ గ్రామంలో సుమారు 55 ఏళ్లుగా పీటీజీ వర్గానికి చెందిన గిరిజనులు నివసిస్తున్నారు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు నిత్యజీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సందర్భాల్లో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులను భుజాలపై మోసుకుంటూ కిలోమీటర్ల దూరం నడక ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు మాట్లాడుతూ, 15 ఏళ్ల క్రితం రహదారి మంజూరైనప్పటికీ, గుత్తేదారుడు కొంత భాగానికి కంకర రాయి వేసిన తర్వాత పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుండి ఆ మార్గం మరింత అధోగతిలోకి వెళ్లిపోయింది. వర్షాకాలంలో ఈ పశువుల బాటలో నడక కూడా ప్రమాదకరమైపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వేడుకుంటున్న పిల్లలు, తల్లిదండ్రులు



గంగవరంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

90 శాతం సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయం, జడ్డంగిలో అగ్రికల్చర్ మార్కెటింగ్ చైర్మన్ లోతా లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గిరిజన రైతులకు ప్రభుత్వం ఇస్తున్న 90శాతం సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి వడుగుల జ్యోతి మాట్లాడుతూ రైతులు తప్పకుండా పంట నమోదులో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. లబ్బర్తి ఎంపిటిసి టిడిపి మండల మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావ్, దూసరపాము ఎంపీటీసీ నల్ల సత్తిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వ్యవసాయ అధికారి చక్రవర్తి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంగవరం : ఖరీఫ్ పంట కాలనికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 90శాతం రాయితీపై గిరిజన సన్న/చిన్నకారు రైతులకు విత్తనాలను ప్రజా ప్రతినిధుల చేతుల మీదగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ మండలంలోని బయనపల్లి, కొత్తాడ, జడేరు, మోహనాపురం పరిధిలోని 4 రైతు సేవా కేంద్రాల్లో బిపిటి-5204, మీఖ-1064, ఆర్‌జిఎల్-2537, మీఖ-1121, మీఖ-1318 రకాలు అందుబాటులో వున్నాయని తెలిపారు. విత్తనాల కొరకు గిరిజన రైతులు ఆధార్ కార్డు, 1బి, అడంగల్ కాపీలను తీసుకుని సమీప రైతు సేవా కేంద్రంలో గల అగ్రికల్చర్ సహయకులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాదేవి, టిడిపి మండల అధ్యక్షులు పాము అర్జున్, రాష్ట్ర రైతు సంఘం ప్రతినిధి కనిగిరి రాంబాబు, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, ఎంపీటీసీ ఆదినారాయణ, నీలాలమ్మ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని దొంగల జగ్గారం గ్రామానికి చెందిన పూసం వెంకటేశ్వర్లు అనే ఆదివాసీ గిరిజన కుటుంబానికి ఇంటి నిర్మాణానికి కావలసిన 12 సిమెంట్ రేకులు,10 ఇనుప పైపులను జెకెసి ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ గురువారం అందజేశారు. నిరుపేద అయిన వెంకటేశ్వర్లు ఎండా వానలకు ఇబ్బంది పడుతూ పూరి గుడిసెలోనే ఉంటున్న నేపథ్యంలో గ్రామస్తులు అతని పరిస్థితిని జమాల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి వెంకటేశ్వర్లు ఇంటి నిర్మాణానికి సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ అధ్యక్షులు ఎండి జహంగీర్, సాల్మన్ రాజు, ఇర్కం శ్రీను, మడకం దుర్గారావు, స్వామి, ఇర్కం వెంకటేష్, పూసం ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు జానీ, వహీద్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం గ్రామపంచాయతీ పరిధి అడవి వెంకన్నగూడెం గ్రామంలో గమ్మ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజనులకు నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. ట్రస్టు సీఈఓ దుర్గాప్రసాద్ సూచనల మేరకు క్లస్టర్ కో-ఆర్డినేటర్ సొందే సునీల్ కుమార్, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, మాజీ సర్పంచ్ కుంజ. నాగిరెడ్డి, ఎంసిఓ ముత్తయ్య ఆధ్వర్యంలో 40 కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారు. అలాగే చింతూరు మండలం ఎర్రంపేటలో 10 కుటుంబాలకు, సర్పంచ్ దారయ్య, సాయిబాబా ఆధ్వర్యంలోనూ, ఏకవారిగూడెంలో 10 కుటుంబాలకు ఎంపీటీసీ రాజ్ కుమార్ ఆధ్వర్యంలోనూ నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ విసిఓలు ఎం.గంగమ్మ ఎం.రాజు, వి.రజిని, యూ.రజిని, పి.బాలు పాల్గొన్నారు.

సమృద్ధిగా జలాశయాలు

వచ్చే నెల చివరిలో సాగునీరు విడుదల
పూర్తికాని కాలువ పనులు



నిండుకుండలా తాండవ జలాశయం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని జలాశయాల్లో నీటి మట్టాలు సమృద్ధిగా ఉన్నాయి. ఆయకట్టుకు నీరు సరఫరా చేసే కాలువలు మాత్రం సరిగా లేవు. ప్రధాన, పిల్ల కాలువ పనులు ఇంకా పూర్తికాలేదు. గురువారం తాండవ జలాశయంలో 195, రైవాడలో 197, కోనాంలో 10, పెద్దేరు జలాశయంలో 45 క్యూసెక్కుల నీరు చేరింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగుకానుంది. వర్షాలతో రైతులు ఆకుమడులు సిద్ధం చేస్తున్నారు. జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగితే గతేడాది కంటే ముందుగానే నీరు విడిచిపెడతామని నీటిపారుదల శాఖాధికారులు చెబుతున్నారు. తాండవ కింద 32,689 ఎకరాలు, పెద్దేరు కింద 15,105 ఎకరాలు, రైవాడ కింద 15,344 ఎకరాలు, కోనాం కింద 12,276 ఎకరాల ఆయకట్టు వుంది. పెద్దేరు మినహా మిగిలిన జలాశయాలన్నింటిలోనూ గతేడాది కంటే ఈసారి నీరు ఎక్కువగా వుంది. తాండవ జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 380 అడుగులకుగానూ గతేడాది జూన్ 26 నాటికి 357.80 అడుగుల నీరు ఉంది. ఈ ఏడాది అదే తేదీకి 367.10 అడుగులకు చేరింది. పెద్దేరులో 137 మీటర్లకు గతేడాది 136.40 మీటర్ల నీరుండగా, ఈ ఏడాది 136 మీటర్ల నీరు వుంది. రైవాడ పూర్తిస్థాయి నీటిమట్టం 114 మీటర్లకు గతేడాది 104.80 మీటర్లుండగా, ఈ ఏడాది 110.94 మీటర్లకు పెరిగింది. కోనాంలో 101.25 మీటర్లకు గతేడాది 95.60 మీటర్ల నీరువుండగా, ఈ ఏడాది 95.70 మీటర్ల నీరు నిల్వవుంది.

కాలువల సంగతేంటి ?

నీటి సరఫరాకు ఆటంకంగావున్న తుప్పలు, డొంకలు కొట్టించి కాలువల మరమ్మతులు చేపట్టేందుకు సరిపడా నిధులను ప్రభుత్వం ఇవ్వలేదు. విడిచిపెట్టిన నీరు చివరివరకూ పారేలా తాండవ, పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయ కాలువలు లేవు. వచ్చే నెల రెండో వారంలోపు కొన్ని పనులు పూర్తిచేసి, చివరి వారంలో ఖరీఫ్‌లో ఉడుపులు చేసేందుకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖాధికారులు భావిస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాలు, ప్రాజెక్టు కమిటీల నుంచి ఈలోపు అభిప్రాయాలు తీసుకోనున్నారు. జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో వీటి పరిధిలోని 75,414 ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు సరఫరా చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు పడ్డంతో నీటి ప్రవాహం పెరుగుతోంది.

నేడు సూపర్ ఇసిబిసి భవనం ప్రారంభం



సాగర్‌నగర్‌లో నిర్మించిన ఇసిబిసి భవనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సాగర్ నగర్‌లో ఎపిఇపిడిసిఎల్ నిర్మించిన సూపర్ ఇసిబిసి (ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్) భవనాన్ని శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి గురువారం తెలిపారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఎపిఇపిడిసిఎల్ ఒక సవాలుగా తీసుకొని సుమారు రూ.14 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించిందని, దీనికి భారత ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ 5 కోట్ల రూపాయలను ప్రోత్సాహకంగా మంజూరు చేసిందని ఆయన తెలిపారు. భవనం మొత్తం ఎనర్జీ కన్జర్వేషన్‌తో, విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవడానికి ఒక ఉదాహరణగా నిలవనుందని పేర్కొన్నారు.

ఇపిడిసిఎల్ పరిధిలోని 11 జిల్లాల ఉద్యోగులకు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ కోసం ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ నార్మ్స్‌తో నిర్మించిన ఈ భవనం జి+2 అంతస్తులతో, ఒక్కొక్క అంతస్తు 14 వేలా 4 వందల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించబడిందన్నారు. ఈ భవన నిర్మాణానికి నాలుగు ప్రమాణాలు అనుసరించామని తెలిపారు. వాటిలో మొదటిది సూర్యుని వెలుతురును నియంత్రించే కిటికీల పద్ధతి, రెండోది పవర్ సేవింగ్, స్టార్ రేటెడ్ ఉపకరణాలు వాడే పద్ధతి, మూడోది విఆర్‌వి ఎయిర్ కండిషన్ పద్ధతి, నాలుగోది రెన్యువబల్ ఎనర్జీ పద్ధతి అని పేర్కొన్నారు. గోడలన్నీ కావిటీ వాల్స్‌తో కట్టబడ్డాయని, అవుటర్ వాల్ 8 అంగుళాలు, ఇన్నర్ వాల్ 4 అంగుళాలు, మధ్యలో ఎయిర్ గ్యాప్ 4 అంగుళాలు మొత్తం 16 అంగుళాలు గోడల నిర్మాణంలో ట్రిపుల్ ఎసి బ్రిక్స్ ఉపయోగించడం వల్ల వేడి లోపలకు రాదని తెలిపారు. సాధారణ భవన నిర్మాణాల కిటికీలకు ఒక్క పొర ఉండే గ్లాసులు మాత్రమే వాడతారని, కానీ సూపర్ ఇసిబిసి నిర్మాణానికి మూడు పొరలు అవుటర్ గ్లాస్, 12 మిల్లీమీటర్ల మధ్యలో 6 మిల్లీమీటర్ల ఎయిర్ గ్యాప్, ఇన్నర్ గ్లాస్ 6 మిల్లీమీటర్ల మందం మొత్తంగా 24 మిల్లీమీటర్ల మందం కలిగిన గ్లాసులు వాడటం వల్ల భవనంలోకి వేడి తక్కువగా ప్రసరిస్తుందన్నారు. ఇక సీలింగ్ విషయానికి వస్తే.. 100 డెకింగ్ సీలింగ్ చేసామని, 50 మిల్లీమీటర్ల మందంగల రాక్ వుడ్‌తో స్లాబ్‌కి టచ్ అవుతూ ఒక సీలింగ్ వేసి, తర్వాత ఎయిర్ గ్యాప్ ఇచ్చి ఫాల్స్ సీలింగ్ చేసామని, దీంతో స్లాబ్ నుండి వేడి కిందకు దిగదని అన్నారు. మొత్తం భవనంలో 40 నుంచి 60 శాతం విద్యుత్ ఆదా అవుతుందన్నారు

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కోసం వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం : విఆర్.పురం మండలంలో వరద బాధితులకు సంబంధించిన పునరవాస కేంద్రాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని తెలుగు దేశం పార్టీ మండల కమిటీ సభ్యులు గురువారం చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్‌ను విన్నవించారు. పునరవాస కేంద్రాలలో నీటి ఎద్దడి లేకుండా చేతి పంపులు రామవరం -1, అడవి వెంకన్న గూడెం -1, చింతరేగుపల్లి గుట్ట లో -1, నూతి గూడెం -1, జీడి గుప్పప్లెడ్ షెల్టర్‌లో -1 ఏర్పాటు చేయాలని, టార్పలిన్లు ఇవ్వాలని, పునరావాస కేంద్రాలలో బుష్ క్లియరెన్స్ చేయాలి, హస్పటల్‌కు, రేఖపల్లి వాటర్ ప్లాంట్‌కు జనరేటర్లు ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిలో ముందస్తుగానే వైద్య సేవల నిమిత్తం మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆసుపత్రిలో పాముకాటు మందు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని, గిరిజనులతో పాటు, గిరిజనేతరులకు కూడా వారు కోరుకున్న ప్రాంతంలో పునరవాస కాలనీకి సంబంధించిన భూమి చూపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, టిడిపి నాయకులు ఆచంట శ్రీనివాస్, ఈళ్ల చిన్నారెడ్డి, బురక కన్నారావు, బీరకాయ సూర్య ప్రకాష్‌రావు, శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం : విఆర్.పురం మండలం నుంచి పోలవరం నిర్వాసితులు పునరావాస కాలనీల క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులో గురువారం తరలివెళ్లారు. ఏలూరు జిల్లా తాడువాయి వద్ద నిర్వాసితులకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేస్తుండగా, నిర్వాసితులు తాడువాయి ప్రాంతాన్ని పరిశీలించారు. రామవరం, రామవరంపాడు, చొప్పల్లి, అడివి వెంకన్నగూడెం, సోములగూడెం, శబరిరాయి గూడెం గ్రామాలకు చెందిన సుమారు 96 మంది బిసి నిర్వాసితులు తరలివెళ్లారు. వారి కోసం ప్రభుత్వ అధికారులు ఉచిత బస్సు, భోజన ఏర్పాట్లు చేశారు. బ్లాక్ నెంబర్ 14 సర్వే నెంబర్119/1బిలో 13 ఎకరాల 12 సెంట్లు రామవరం గ్రామపంచాయతీ పిడిఎఫ్ బీసీ కుటుంబాలకు కేటాయించగా, ఆ స్థలాన్ని వారు అంగీకరించారు. కార్యక్రమంలో విఆర్.పురం తహశీల్దారు సరస్వతి, ఆర్ఐ రామకృష్ణ, విఆర్ఓ హైమావతి, సర్వేయరు హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగమల్లు వంతెన, రహదారి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయితీ పరిధిలో మాదిగ మల్లు వంతెన, రహదారి నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 8న భారీ వర్షాలు వరదలకు మాదిగమల్లు వంతెన రహదారి కొట్టుకుపోయాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. అంబులెన్స్ కూడా వెళ్లలేని స్థితి. గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వంతెన, రహదారి వెంటనే నిర్మించి ప్రజలకు రవాణా సౌకర్యానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అనేకసార్లు ఆ ప్రాంత ప్రజలు పత్రికల ద్వారా అధికారుల దృష్టి తీసుకెళ్లారు. ఎట్టకేలకు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి సోషల్ సెంట్రల్ ఎసెన్స్ (ఎస్‌సిఏ) నిధులు కోటీ 40 లక్షల రూపాయలు మంజూరు చేశారు. దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ రెండు నెలల క్రితం అధికారులు పూర్తి చేశారు. టెండర్‌లో లింగరాజు అనే కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. వంతెనకు, రహదారికి కావలసిన మెటీరియల్ ఇసుక, చిప్స్, ఐరన్, యంత్రాలు తదితర సామాగ్రి సమకూర్చి పనులు శ్రీకారం చుట్టారు. అయితే కొన్ని రోజులుగా ఏజెన్సీలో వర్షాలు పడుతుండడంతో పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాదిగమల్లు వంతెన, రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

19న విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఎన్నికలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పాలకవర్గం ఎన్నికలు జూలై 19న జరుగుతాయని జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు.

మళ్ల సురేంద్రకు సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అక్కినేని వంశాభిమాని మళ్ల సురేంద్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా గురువారం నగరంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో అక్కినేని సీనియర్ అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నవీన్ ప్రసాద్ మాట్లాడుతూ సురేంద్రకు కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించడం ఆనందంగా ఉందన్నారు.